17 వ వసంతం
సూర్య
నేటి దినపత్రిక
www.suryaa.com
ఏలూరు జిల్లా, పశ్చిమ గోదావరి జిల్లా
సోమవారం,12 ఆగస్టు 2024



# మాదకద్రవ్యాల నుండి యువతను కాపాడాలి

## - అమరావతి బ్రాండ్ అంబాసిడర్ వైష్ణవి




**ముదినేపల్లి,మేజర్‌న్యూస్:** మాదకద్రవ్యాల భారీ నుండి యువతను కాపాడా లని అమరావతి బ్రాండ్ అంబాసిడర్ అంబుల వైష్ణవి అన్నారు. గంజాయి,మాదకద్రవ్యాల నిర్మూలనపై ముదినేపల్లిలో యువతకు అవగాహన కల్పించేందుకు పురవీధుల్లో వైష్ణవి ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా ఐటిఐ కళాశాల కరస్పాండెంట్ కూనపురెడ్డి సత్యనారా యణ,ఇండో సాక్సన్ ప్రిన్సిపాల్ జార్జ్ ,విద్యాంజలి ప్రిన్సిపాల్ కృష్ణారావు మాట్లాడుతూ నేటి యువత మాదకద్రవ్యాల బారిన పడకుండా సమాజంలో అవగాహన తీసుకురావాలన్నారు. సమాజంలోవాటివలన కలిగే నష్టాలు అనర్థాలపై చర్చించాలన్నారు. అనంతరం వైష్ణవిని ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో పూల మాలలతో శాలువాతో సత్కరించారు.ఈకార్యక్రమంలో లాయర్‌రెడ్డిబంగారయ్య,అర్జునరావు,డాక్టర్ పవన్ ,డాక్టర్ అంబుల మనోజ్,ప్రెస్ క్లబ్ అధ్యక్షులు సిహెచ్ నాగరాజు, ఏపీయూడబ్ల్యూజే సంయుక్త కార్యదర్శులు విజయకుమార్, ఎస్ శ్రీనివాసరావు,సభ్యులు చంద్రశేఖర్, సంపత్‌కుమార్,శివరాజ్,భుజంగరావుశివ,నందీశ్వరరావు,సాగర్ పాల్గొన్నారు.

# డ్రైనేజీ వ్యవస్థ ప్రక్షాళన ఎంతో ముఖ్యం




### జిల్లా కలెక్టర్,ఎమ్మెల్యే

**కాళ్ళ,మేజర్‌న్యూస్:** మురుగు నీరు సక్రమ పారుదలతో వ్యాధులనుండి రక్షణ పొందవచ్చు అని,ఇందుకు డ్రైనేజీ వ్యవస్థ ప్రక్షాళన ఎంతో ముఖ్యమని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు.ఆదివారం కాళ్ల మండలం కలవపూడి గ్రామంలోని మామిడిపూడి రోడ్డు వద్ద మురుగు కాలువలో పూడికతీత పనులకు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి కొబ్బరికాయ కొట్టి పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో స్థానిక శాసనసభ్యులు కనుమూరి రఘురామకృష్ణంరాజు జిల్లా కలెక్టర్ తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ సక్రమంగా నీటిపారుదల అయినప్పుడే వ్యాధుల నుండి రక్షణ పొందగలమన్నారు. రొయ్యల చెరువులు పట్టుబడి అనంతరం కలుషిత నీటిరు మురుగు కాలువలలోకి వెళ్ళాలని, అలా కాకుండా ప్రస్తుతం ఆనీరు పంట కాలువల్లోకి వెళ్ళడంతో ప్రజలు అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు.ఉండి నియోజకవర్గం శాసనసభ్యులు కనుమూరు రఘురామకృష్ణంరాజు రైతుల భాగస్వామ్యంతో మురుగు కాలము శుభ్రపరిచేందుకు సంకల్పించడం, దీనికి గ్రామంలోని ప్రతి రైతు సహకారం అందించడం ఎంతో అభినందనీయం అన్నారు. ఇలా చేయటం వలన నియోజకవర్గం లో ప్రతి గ్రామంలో మంచి స్పందన వచ్చిందన్నారు. కలవపూడి గ్రామంలో మంతెన పెద్ద నరసింహరాజు, మిగతా రైతులందరు కలిసి సుమారు 13 లక్షల రూపాయలు విలువ కలిగిన పనులను ప్రారంభించడం జరిగిందన్నారు. ప్రారంభించిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు.శాసనసభ్యులు రఘురామ కృష్ణంరాజు మాట్లాడుతూ ప్రభుత్వం, రైతుల సహకారంతో ఉండి నియోజకవర్గంలోని డ్రైయిలు, కాలువలను రెండు, మూడు నెలలలో పూర్తిగా ప్రక్షాళనం చేయటం జరుగుతుందన్నారు.
అనంతరం జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, శాసనసభ్యులు కనుమూరు రఘురామ కృష్ణంరాజు ప్రాతళ్ల మెరక గ్రామంలో మంచినీటి చెరువును పరిశీలించారు. చుట్టు రిటైనింగ్ వాల్ నిర్మాణ పనులు పూర్తి చేసి చక్కటి మొక్కలు నాటడంతో ఆ ప్రాంతం ఆహ్లాద ఉండడంతో సంతృప్తిని వ్యక్తం చేశారు. ఇలా ప్రతి గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుకోవాలన్నారు. ప్రభుత్వ ఆరోగ్య ఉప కేంద్రంను సందర్శించారు. అనంతరం కలవపూడి జిల్లా పరిషత్ హై స్కూల్ ఆవరణలో జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, ఎమ్మెల్యే రఘురామ కృష్ణంరాజు మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్నారు.
ఈ కార్యక్రమంలో పశ్చిమ గోదావరి జిల్లా టిడిపి అధ్యక్షులు మంతెన రామరాజు, మంతెన పెద్ద నరసింహరాజు, గ్రామ సర్పంచ్ గేదల జాన్, ఇంచార్జి తహసీల్దార్ ఇ.నాగార్జున, ఎంపిడిఓ జి.స్వాతి, శివవర్మ, మంతెన శివాజీ రాజు, తదితరులు పాల్గొన్నారు.





# సైనికుల త్యాగాలు అనిర్వచనీయం

### సీఎం దృష్టికి సైనిక కార్పొరేషన్ విషయం
### కార్గిల్ విజయ్ దివస్ రజతోత్సవ వేడుకలో
### రాష్ట్ర హెూం మంత్రి అనిత

**తాడేపల్లిగూడెం,మేజర్‌న్యూస్:**సైనికుల సంక్షేమానికి కార్పొరేషన్ ఏర్పాటు అంశాన్ని సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లి చర్యలు తీసుకుంటామని రాష్ట్ర హెూం శాఖ మంత్రి వంగలపూడి అనిత భరోసా ఇచ్చారు. పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెం ఏపీ నిట్ ఆవరణలో కార్గిల్ విజయ్ దివస్ రజతోత్సవ వేడుక ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభకు టీబీఆర్ విద్యాసంస్థల అధినేత బుద్ధి భోగేశ్వర రావు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న మంత్రి అనిత మాట్లాడుతూ సైనికులు 30నుంచి35ఏళ్ల మధ్య రిటైర్ అవుతున్నారని,రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలు ప్రస్తుతం ఉన్న రెండుశాతం రిజర్వేషన్లను పెంచడానికి క్యాబినెట్ దృష్టికి తీసుకెళ్తామన్నారు. జిల్లాలో ఖాళీల భర్తీకి చర్యలు చేపడతామన్నారు. ఏటా మనకు గుర్తుండిపోయే రోజులు జనవరి 26, ఆగస్టు 15 అని తెలిపారు.దేశం కోసం ప్రాణాలను ఫణంగా పెట్టినవారు సైనికులని కొనియాడారు. తాడేపల్లి గూడెం మండలం మిలటరీ మాధవరం గ్రామానికి తాను ఒకసారి వస్తానన్నారు. ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రజలంతా సుఖంగా ఉన్నామంటే దానికి కారణం సైన్యం అని కొనియాడారు. సైనిక స్కూల్ ద్వారా రాష్ట్రంలో ఒక వినూత్న ప్రయోగం చేసిన టీబీఆర్ విద్యా సంస్థల అధినేత భోగేశ్వరరావుని అభినందించారు. కార్గిల్ యుద్ధంలో పనిచేసిన ప్రతి ఒక్కరికి శిరసు ఉంచి నమస్కరిస్తున్నానన్నారు. మిలటరీ మాధవరం గ్రామం తన నియోజకవర్గంలో ఉండడం గర్వంగా భావిస్తున్నాను అన్నారు.సెంట్రల్ గవర్నమెంట్ స్టాల్స్ క్యాంటీన్ పెట్టాలని మాజీ సైనికులు కోరుతున్నారని ఈ విషయాన్ని సీఎం దృష్టిలో పెట్టినట్లు ఆయన గుర్తు చేశారు. ఈ విషయంలో మంత్రి అనిత చొరవ తీసుకోవాలని కోరారు. మిలిటరీలో మృతి చెందిన వారి కుటుంబాల సంక్షేమం కోసం 3కోట్లరూపాయలను పవన్ కళ్యాణ్ విరాళం అందజేశారన్నారు. ఉంగుటూరు ఎమ్మెల్యే పత్స మట్ల ధర్మరాజు మాట్లాడుతూ దేశంలో మనకు స్వేచ్ఛగాఉన్నామంటే అది సైనికుల త్యాగ ఫలితమేనని పేర్కొన్నారు.సైనికులు దేశసరిహద్దుల్లో ఏవిధంగా పోరాటం చేస్తున్నారో అదే విధంగా గత ప్రభుత్వంలో పోరాటం చేసి కూటమి ప్రభుత్వాన్ని అధికారంలోకి తెచ్చామన్నారు. **సైనికుల సేవలను స్మరించుకోవాలి..** సైనికులను ప్రతి ఒక్కరు స్మరించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని కేంద్ర భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతి రాజు శ్రీనివాస్ వర్మ అన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గారపాటి సీతారామాంజనేయచౌదరి,పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షుడు నార్నితాతాజీ, తాడేపల్లిగూడెం నియోజకవర్గం కన్వీనర్ ఈత కోట తాతాజీ,నరసాపురం జిల్లా మీడియా కన్వీనర్ నరిసే సోమేశ్వర రావు, నాయకులు మారిశెట్టి నరసింహమూర్తి, పసుపులేటి రామారావు, గురజాడ ఆనంద్ కుమార్, గట్టిం మాణిక్యాలరావు, కొండపల్లి నగేష్, కొండేపాటి వెంకటేశ్వరరావు ప్రభృతులు పాల్గొన్నారు.

## మహిళలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి



**బుట్టాయిగూడెం,మేజర్‌న్యూస్ :** ఎన్నికల్లో మహిళలకు ఇచ్చిన హామీలను ఎన్డీఏ ప్రభుత్వం అమలు చేయాలని ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కుర్సం లత ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని దొరమామిడి గ్రామంలో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా కార్యవర్గం అధ్య క్షులు వెట్టి భారతి అధ్యక్షత వహించారు. ఈ సమావేశానికి విచ్చేసిన కుర్సం లత మాట్లాడుతు ఎన్నికల ముందు మహిళలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ఓట్లకోసం ఎన్ని ఇబ్బందులు ఎదురైన అవరోదాలను అధిగమించి వనరులను సృష్టించుకోని హామీలను అమలు చేస్తామని లేనిపోని మాయ మాటలు చెప్పి ఇప్పుడు నిధుల కొరత వెంటాడుతుందని అందుకే హామీలు అమలు చేయటం కష్టంగావుందనిఅనటం సరైందికదాన్నారు.చంద్రబాబు అధికారకోసమే హామీలు ఇచ్చారు కానీ మహిళలపై ప్రేమతో కాదని మండిపడ్డారు.
మద్యం వలన మహిళలు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం మద్యాన్ని ప్రదాన ఆర్థిక వనరుగా చేసుకోవడం సిగ్గుచేటన్నారు. మద్యాన్ని నిషేదింటి మహిళల ప్రాణాలకు రక్షణ కల్పించాలని కోరారు. జిల్లా మహిళా ఉధ్యమాన్ని పటిష్టం చేయడం కోసం అక్టోబర్ నెలలో జిల్లా మహా సభలను నిర్వహిస్తామనిఈ మహా సభలకు అన్ని వర్గాల ప్రజలు సహాకరించాలని కోరారు. ఈ సమావేశంలో సహాయ కార్యదర్శి ఈమని మల్లిక, జిల్లా కోశాదికారి కారం అరుణజిల్లా కార్యవర్గం సభ్యులు ధర్మల లక్ష్మి,తగరం సత్యవతి,సరియం అనిత పాల్గోన్నారు.

## బొర్రంపాలెంలో ఉచిత కంటి వైద్య శిబిరం
## 100 మందికి పైగా పరీక్షలు
### - త్వరలో 20 మందికి కంటి ఆపరేషన్లు




**టి.నర్సాపురం,మేజర్‌న్యూస్:**టి.నర్సాపురం మండలం బొర్రంపాలెం గ్రామంలో ఫర్ ది పీపుల్ యూత్ సంస్థ ఆధ్వర్యంలో ఎంపీపీ స్కూల్లో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించడం జరిగింది. శిబిరానికి నిడదవోలు కంటి వైద్య నిపుణులు రాజేశ్వరి రామకృష్ణ లయన్స్ నేత్ర వైద్యశాల వారు వచ్చారు. చాలామంది వృద్ధులు శిబిరంలో వైద్య పరీక్షలు చేయించుకున్నారు.
అవసరమైన వారికి కంటి ఆపరేషన్‌లు కూడా ఉచితంగా చేస్తామని తెలిపారు. శిబిరంలో 100 మందికి పైగా పరీక్షలు చేయించుకున్నారు. 20 మందికి పైగా ఆపరేషన్లు జరుగుతాయని డాక్టర్లు వెల్లడించారు. ఆర్గనైజర్ కలపర్తి విజయ్ మాట్లాడుతూ మా యూత్ ద్వారా ఇలాంటి సేవా కార్యక్రమాలు ఎన్నో చేస్తున్నామని,త్వరలోనే మరిన్ని మెడికల్ క్యాంపులు నిర్వహిస్తామని తెలిపారు.ఈకార్యక్రమంలో రెళ్ళ మోషే, గుండె ప్రవీణ్ కుమార్,రవి, గాంధీ, సురేష్, మోషే తదితరులు పాల్గొన్నారు.

# పొగాకు రైతులకు జిల్లాలో రూ.15 కోట్లు, రాష్ట్రంలో 110 కోట్లు లబ్ది

## ఎంపీ పుట్టా మహేష్ కుమార్

### ఘనంగా సత్కరించిన రైతులు

**ఏలూరు, మేజర్‌న్యూస్:** ఇటీవల దేవరపల్లిలో జరిగిన పొగాకు రైతుల అవార్డుల వేడుకలో ఎంపీ పుట్టా మహేష్ కుమార్ కు రైతులు వారి సమస్యలు చెప్పగా తక్షణం స్పందించిన ఎంపీ ఢిల్లీ లో కేంద్ర వాణిజ్య శాఖ మంత్రిని కలుసుకున్నారు. రైతులు అదనంగా పండించిన పొగాకు పంట పై ఫెనాల్టీ రద్దు చేయాలని కోరారు. అందు గురించి కేంద్ర ప్రభుత్వం అదనంగా పండించిన పొగాకు పంటకు ఫెనాల్టీ రద్దు చేస్తూ జీవో విడుదల చేసింది.ఈ సందర్భంగా జిల్లాలో పొగాకు పంట పండించిన రైతులు ఆదివారం వందలాదిగా ఏలూరు వచ్చి ఎంపీ పుట్టా మహేష్ కుమార్ ను ఘనంగా సత్కరించారు.
పొగాకు రైతు సంఘాల అధ్యక్షులు పరిమి రాంబాబు,కరాటంరెడ్డి నాయుడు, కాకర్ల వివేకానంద ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎంపీ పుట్టా మహేష్ కుమార్ కృషి వలన జిల్లాలో ఉన్న 15 వేల మంది పొగాకు రైతులు 15 కోట్లు, రాష్ట్రం లో ఉన్న 1లక్ష మంది పొగాకు రైతులు 110 కోట్ల రూపాయల లబ్ది పొందామన్నారు. అలాగే ప్రతి సంవత్సరం దేశానికి 25 వేల కోట్లు నష్టం కలిగిస్తున్నకిలీసిగరెట్ల అక్రమ దిగుమతులను అరికట్టాలని కోరారు.ఎంపీ పుట్టా మహేష్ కుమార్ మాట్లాడుతూ ఎన్నికల్లో చెప్పినట్లు అన్ని రకాల పంటలు పండించే రైతులకు గిట్టుబాటు ధరలు సాధిస్తానన్నారు. మాట తప్పేది లేదు. ఏ పని పట్టుకున్నా, అయేవరకు వదిలిపెట్టనన్నారు. రైతులను గుండెల్లో పెట్టుకుంటానని. నిన్న ప్రధాన మంత్రి నరేంద్ర మోదీనికలిశాను. రైతులకు గిట్టుబాటు ధర, యువతకు ఉపాధి,




పోలవరం నిర్మాణం వేగవంతం, పోలవరం నిర్వసితులకు న్యాయానికి చేయాలనీ అడిగానన్నారు.త్వరలో జరగనున్న కేంద్ర కేబినెట్ మీటింగ్‌లో పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి 12వేల కోట్ల రూపాయల మంజూరు ఛేస్తున్నారని అన్నారు. ఇటీవల జరిగిన పార్లమెంట్ సమావేశాల్లో యువతకు ఉపాధి, రైతులకు గిట్టుబాటు ధర, పోలవరం, రైల్వే ప్రాజెక్టుల గురించి,మాట్లాడాను.ఏలూరుకు వందేభారత్ నిలుపుదల గురించి అడిగాను. సెప్టెంబర్ నెలలో ఏలూరులో జాబ్ మేళా నిర్వహిస్తామన్నారు ఎంపీ పుట్టామహేష్‌కుమార్.ఈ సమావేశంలో మాజీ శాసన సభ్యులు ఘంటా మురళీ, పొగాకు రైతు నాయకులు సత్రం వెంకట్రావు, కాకర్ల శేషుబాబు మరియు జిల్లా నలుమూలల నుండి వందలాదిగాకూటమి పార్టీల నాయకులు పాల్గొన్నారు.

# రాత్రి 11 గంటల వరకే ఏలూరు జిల్లాలో వ్యాపారాలకు అనుమతి

### జిల్లా ఎస్పీ కె.ప్రతాప్ శివ కిషోర్




**ఏలూరు,మేజర్‌న్యూస్:** ఏలూరు జిల్లాలో రాత్రి 11గంటల వరకే వ్యాపారాలు నిర్వహించాలని, ఆ తర్వాత మూసివేయాల్సిందేనని జిల్లా ఎస్పి కె.ప్రతాప్ శివకిషోర్ తెలిపారు.సహేతికమైనటువంటి కారణాలు లేకుండా ఎవరైనా రాత్రుళ్ళు సంచరిస్తే వారిపై చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ ఆదేశించారు.
రాత్రి 11గంటల తరువాత వ్యాపార సముదాయాలను, దుకాణాలను మూయాల్సిందేనన్న జిల్లా ఎస్పీ. లిజిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణలో భాగంగా కఠిన చర్యల తప్పవని జిల్లా ఎస్పీ వెల్లడించారు.ఏలూరు జిల్లాలోని ముఖ్యమైన పట్టణాల్లో రాత్రి 11 గంటల తరువాత ఎవరైనా బహిరంగ ప్రదేశాల్లో సంచరించినా, వ్యాపారాలు సాగించినా వారిపై కేసులు నమోదు చేయాలని పోలీసు అధికారులను జిల్లాఎస్పీ ఆదేశించారు.శాంతి భద్రతల పరిరక్షణ,నేరాల నియంత్రణలో భాగంగాకొన్నికఠినచర్యలు తీసుకుంటున్నా మన్నారు.
పట్టణాల్లో రాత్రి 11గంటల తరువాత ఎటువంటి వ్యాపారాలు నిర్వహించకుండా, అన్ని రకాల వ్యాపారాలను అపు చేయాలని జిల్లా ఎస్పీ స్పష్టం చేసారు.నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా వ్యాపారాలు సాగిస్తే వారిపై కేసులునమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. రాత్రి సమయాల్లో ఎక్కువగా యువత పట్టణాల్లో కారణాలు లేకుండా విచ్చలవిడిగా తిరుగుతున్నారన్నారు. రాత్రి గస్తీ, పెట్రోలింగు నిర్వహించే పోలీసు సిబ్బంది, అధికారులు ఇటువంటి వారిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని జిల్లా ఎస్పీ స్పష్టమైన ఆదేశాలు జారీ చేసారు. రాత్రి గస్తీ,పెట్రోలింగు నిర్వహించే అధికారులు, సిబ్బంది బస్టాండులు, రైల్వే స్టేషను,ముఖ్యకూడళ్ళల్లో అర్ధరాత్రి వరకూ వ్యాపారాలు నిర్వహించే టిఫిన్,పాన్‌షాపులను, చిరువ్యాపారుల నుకట్టడి చెయ్యాలన్నారు. రాత్రి 11గంటల తరువాత పట్టణాల్లో ఎటువంటి వ్యాపారాలు నిర్వహించకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఎవరైనా రాత్రి11గంటల తరువాత వ్యాపారాలు నిర్వహించినా, బహిరంగ ప్రదేశాల్లో అనుమానస్పదంగా సంచరించినా వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని అధికారులను జిల్లాఎస్పీ ఆదేశించారు .బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించిన వారిపై కూడా దాడులను విస్తృతం చేయాలన్నారు. పట్టణ, గ్రామ శివార్లలోని లే-అవుట్స్, నిర్జన ప్రదేశాల్లో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడిన వారిపైనా, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించి ప్రజలకు ఇబ్బందులు కలిగించే వారిపైనా కేసులు నమోదు చేయాలన్నారు.మద్యం సేవించి వాహనాలను నడిపి, ప్రమాదాలకు కారణమవుతున్న వాహనదారుల పైనా ప్రత్యేకంగా దృష్టి పెట్టాలని, వాహన తనిఖీలను,డ్రంకన్ డ్రైవ్, ఓపెన్ డ్రింకింగు తనిఖీలు ముమ్మరం చేసి, కేసులు నమోదు చేయాలని పోలీసు అధికారులకు జిల్లా ఎస్పీ శివ కిషోర్ ఆదేశాలు జారీచేసారు.



## పెనుగొండ ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన గంగాధర్

**పెనుగొండ, మేజర్‌న్యూస్:**పెనుగొండ ఎస్సైగా కే.గంగాధర్ రావు ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా పెనుగొండ వాసవి శాంతిదాంలో వాసవి మాతను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగాఆయన మాట్లాడుతూ మండలంలో శాంతిభద్రతల విషయంలో ప్రజలు సహకరించాల న్నారు. గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాలకు ఎవరైనా పాల్పడితే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. లా అండ్ ఆర్డర్ కు విఘాతం కలిగిస్తే ఎవర్ని ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.

## నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ



**ఏలూరు,మేజర్ న్యూస్ :** జిల్లా కలెక్టరు వారి ఆదేశముల ప్రకారము 12వతేదీసోమవారం ప్రజాఫిర్యాదులపరిష్కారవ్యవస్థ (పీ.జీ.ఆర్.ఎస్) కార్యక్రమము జరుగుతుంది. ఏలూరు జిల్లా కలెక్టరు వారి కార్యాలయము నందలి గోదావరి సమావేశ మందిరము నందు ఉదయం 10నుండి నిర్వహించబడునని జిల్లా కలెక్టర్ కె.వెట్రి సెల్వి ఆదివారం తెలిపారు.

## సమాజ శ్రేయసుకు అందరూ భాగస్వాములు కావాలి

### - అడుసుమిల్లి నిర్మల,ఎస్.విజయకుమార్



**ముదినేపల్లి,మేజర్‌న్యూస్:**సమాజ శ్రేయస్సుకు అందరు భాగస్వాములు కావాలని మానవతా స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు అడుసుమిల్లి నిర్మల,సూదాబత్తుల విజయకుమార్ అన్నారు. ముఖ్యంగా విద్య, వైద్యం, ఉపాధి, పర్యావరణ పరిరక్షణచ ్ కార్యక్రమాలను వివరించారు.ఈ కార్యక్రమంలో ఏలూరు మాన వతా శాఖ కార్యదర్శి వల్లూరుపల్లి సాయిసుధ,డాక్టర్ మనోజ్,ఐటిఐ కళాశాల ప్రిన్సిపాల్ కూనపురెడ్డి సత్యనారాయణ,నిమ్మగడ్డ రవి, గుడివాడ గణేష్,సాక్షి సాయిబాబు,దూసనపూడి దాసు పాల్గొన్నారు.

## టీ.బి.ఆర్ సైనిక్ స్కూల్లో కార్గిల్ విజయ దివాస్



**పెంటపాడు,మేజర్‌న్యూస్:** టీ.బి.ఆర్ సైనిక్ స్కూల్లో కార్గిల్ విజయ దివాస్ రజిత్ జయంత్ మహెూత్సవ కార్యక్రమాన్ని స్కూల్ మరియు కాలేజ్ విద్యాసంస్థ అధినేత తనుబుద్ధి భోగేశ్వరావు చేతుల మీదగా నిర్వహించారు. ఈ కార్యక్రమం యావత్తు కూడా తాడేపల్లిగూడెం నిట్ కాలేజీ ప్రాంగణంలో నిర్వహించారు. దీనిలో ప్రత్యేక అతిథిగా కార్గిల్ యుద్ధంలో పాల్గొన్న పరమవీరచక్ర అవార్డు గ్రహీత సుబేదార్ మేజర్ సంజయ్ కుమార్, కేంద్ర మంత్రి భూపతి రాజు శ్రీనివాస వర్మ, రాష్ట్ర హెూమ్ మినిస్టర్ వంగలపూడి అనిత తాడేపల్లి గూడెం శాసన సభ్యులు బొలిశెట్టి శ్రీనివాస్, ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు, మాజీ బిజెపి ఎమ్మెల్యే సోము వీర్రాజు మాజీ సైనిక సంక్షేమ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులైన ప్రసాద్ మాజీ మేజర్ జనరల్ బి.వి. రావు, బిజెపి జిల్లా అధ్యక్షులు నార్ని తాతాజీ, అసెంబ్లీ కన్వీనర్ ఈతకోట తాతాజీ, బిజెపి జిల్లా మీడియా కన్వీనర్ నరిశే సోమేశ్వరావు మిలిటరీ మాధవరం గ్రామానికి చెందిన అనేక మంది మాజీ సైనికులు ఈ కార్యక్ర మంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో చిన్నారులుఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## నేడు మంత్రి నాదెండ్ల మనోహర్ ఏలూరు రాక

**ఏలూరు,మేజర్‌న్యూస్:** రాష్ట్రపౌర సరఫరాల శాఖా మంత్రి నాదెండ్ల మనోహర్ ఈ నెల 12వ తేదీ ఉదయం 9 గంటలకు తెనాలినుండి కారులో బయలుదేరి 11 గంటలకు ఏలూరు చేరుకుంటారు. ఏలూరులోని సర్.సి.ఆర్.రెడ్డి కళాశాల ఆడిటోరి యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లాలో ధాన్యం కొను గోలు కేంద్రా లకు ధాన్యం అందించిన రైతులకు ధాన్యం సొమ్మును సంబంధిత రైతు లకు చెక్కుల ద్వారా పంపిణీ చేస్తారు. అనంతరం మధ్యాహ్నం 2గం టలకు ఏలూరునుండి బయలుదేరి 4 గంటలకు అమలాపురం వెళతారు.

సూర్య
పశ్చిమ గోదావరి
సోమవారం, 12 ఆగస్టు 2024


# హర్ ఘర్ తీరంగి జయప్రదం చేయండి



జీలుగుమిల్లి,మేజర్‌న్యూస్: మండలం దర్భ గూడెంలో భారతీయ జనతా పార్టీ ముఖ్య నాయకుల సమావేశం బిజెపి గ్రామ అధ్యక్షుడు కేతిరెడ్డి నెహ్రూ రెడ్డి నివాసంలో ఆదివారం జరిగింది. ప్రధాని నరేంద్ర మోడీ పిలుపుమేరకు ఆగస్టు 13 నుండి 15 వరకు హర్ ఘర్ తిరంగి కార్యక్రమం జయప్రదం చేయాలని సమావేశంలో నాయకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బొరగం వెంకటలక్ష్మి, జిల్లా కార్యదర్శి చాట్రాతి ప్రసాద్, మండల అధ్యక్షులు కొండపల్లి ప్రసాద్, సీనియర్ నాయకులు, పులగం సుబ్బారెడ్డి, యు శ్రీనివాస్, గుజ్జు ప్రసాద్, కె.రాము,కేతిరెడ్డి రాజ కుమారి, బుగ్గల శివ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# కోళ్ల వ్యర్థాలు తరలిస్తున్న వాహనం సీజ్




భీమడోలు,మేజర్‌న్యూస్: నిషేధిత కోళ్ళ వ్యర్థాలను చేపల మేతగా తరలిస్తున్న ఒక వాహనాన్ని జాతీయ రహదారిపై సూరప్ప గూడెం వద్ద ఆదివారం స్వాధీనపరుచుకున్నట్లు భీమడోలు ఎస్సై సుధాకర్ తెలిపారు. భీమడోలు పోలీసులు తెలిపిన వివరాల మేరకు ఏలూరు మండలం కొక్కిరాల లంక గ్రామానికి చెందిన ఘంటసాల శేషుబాబు తన వాహనంలో డ్రైవర్ దొంగల రాజేష్ సహకారంతో పోతవరం గ్రామంలో సేకరించిన కోళ్ల వ్యర్థాలను చేపల మేతగా తరలిస్తున్నట్టు ముందస్తు సమాచారం భీమడోలు పోలీసులకు చేరింది. ఈ మేరకు అప్రమత్తమైన పోలీసులు సూరప్పగూడెం వద్ద నిర్వహించిన తనిఖీలలో సదరు వాహనం పట్టుబడింది. ఈ మేరకు సరుకుతో సహా వాహనాన్ని స్వాధీనం చేసుకున్న పోలీసులు బాధ్యులపై కేసు నమోదు చేశారు.

# పోలవరం నిర్వాసితులకు పరిహారం ఇవ్వండి

– మంత్రి డాక్టర్ నిమ్మలకు సిపిఎం ప్రతినిధి బృందం వినతి



**కుక్కునూరు,మేజర్‌న్యూస్:** భూసేకరణ చట్టం ప్రకారం నిర్వాసితులకు పరిహారం ఇచ్చిన తర్వాతే ప్రాజెక్టు పనులు చేపట్టాలని సీపీఎం ఏలూరు జిల్లా కార్యదర్శి ఏ.రవి అన్నారు. శనివారం పాలకొల్లులో జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడుతో సీపీఎం బృందం నిర్వాసితుల సమస్యలుపై గంటన్నర పాటు చర్చించి అనంతరం సమస్యలుతో కూడిన వినతిపత్రాని అందజేశారు. ఈ సందర్భంగా ఏ.రవి మాట్లాడుతూ, నిర్వాసితుల త్యాగాల పునాదులపై పోలవరం ప్రాజెక్టు నిర్మిస్తున్నామని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రకటిస్తూనే ఉన్నాయని. కాని ప్రాజెక్టు నిర్మించడంలో ఉన్న శ్రద్ధ నిర్వాసితులకు పునరావాసం కల్పించడంలో లేదని అన్నారు. ఫలితంగా ఈ 15 ఏళ్ళలో ప్రాజెక్టు నిర్మాణం 75 శాతంపైగా పూర్తికాగా పునరావాస కల్పన 10 శాతం కూడా మించలేదని. పునరావాసం కల్పించిన వారికి సైతం అరకొరగానే సాగిందని అన్నారు. పోలవరం ప్రాజెక్టులో ముంపునకు గురయ్యే ప్రాంతాలను ప్రభుత్వాలు అశాస్త్రీయంగా గుర్తించాయని. 2022 జూలైలో వచ్చిన వరదల్లో 41.5 కాంటూరు పైబడిన గ్రామాలు సైతం మునిగిపోయాయి. ఏలూరు జిల్లాలోపోలవరం,కుకునూరు, వేలేరుపాడు మండలాల్లోని 25వేల కుటుంబాలు, 1లక్ష మంది నిర్వాసితులౌతున్నారు. వీరిలో అత్యధికులు గిరిజనులే.వీరికి పోలవరం, బుట్టాయి గూడెం, జీలుగుమిల్లి, జంగారెడ్డిగూడెం, కొయ్యలగూడెం మండలాల్లో పునరావాస కాలనీలు నిర్మించారు. సమస్యలు కోకోల్లుగా ఉన్నాయి. ఒక్క కుటుంబానికి కూడా పూర్తిస్థాయిలో పునరావాసం కల్పించలేదని, నూతన ప్రభుత్వం స్పందించి పునరావాస కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు పంచాయితీలకు కాలనీలు అప్పచెప్పి వాటికి అవసరమైన నిధులు కేటాయింపులు చెయ్యాలని కోరారు,

కుక్కునూరు, వేలేరుపాడు మండలాల నుండి తరలించిన నిర్వాసితులకు ఆ గ్రామ పరిధిలోకి బ్యాంక్ ఇతర సేవలు మార్చాలని, 2013 భూసేకరణ చట్టం ప్రకారం ఆర్అండ్ఆర్ ప్యాకేజి తక్షణమే గత ప్రభుత్వం ఇచ్చిన హామీ రూ. 10 లక్షలు చెల్లించాలని, 2022 ముంపు ఆధారంగా కుక్కునూరు, వేలేరుపాడు మండలాలకు పరిహారం చెల్లించాలని, కాంటూర్‌తో సంబంధం లేకుండా పునరావాస కాలనిలకు తరలించి ఆలోట్మెంట్ ఆర్డర్ ఇవ్వాలని మంత్రిని కోరారు.ఎర్ర కాలువ రిజర్వాయర్ మిగులు భూములు స్థానిక పేదలకు సాగుకు ఇవ్వాలని అన్నారు.

**సమస్యలు పరిష్కరిస్తాం..** మంత్రి నిమ్మల మాట్లాడుతూ నిర్వాసితుల గ్రామాలు వరదలు సమయంలో పర్యటన చేశామని, నిర్వాసితులు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వీలైనంత త్వరగా నిర్వాసితులకు న్యాయమైన పరిహారం ఇచ్చి సమస్యలు పరిష్కారం చేసేలా చూస్తామని హామీ ఇచ్చారు.అధికారులతో నిర్వాసితుల నాయకుల సంయుక్త సమావేశం నిర్వహిస్తామని, ఎర్రకాలువ రిజర్వాయర్ భూములుపై విచారణ జరిపి పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చారు.ఈకార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు మంతెన సీతారాం, కుక్కునూరు, జంగారెడ్డిగూడెం మండల కార్యదర్శులు యర్రంశెట్టి నాగేంద్రరావు, మానుకోండ జీవరత్నం, మండల కమిటీ సభ్యులు యర్నం సాయికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# దొడ్డిపట్లలో మెగా వైద్య శిబిరం



**పాలకొల్లు,మేజర్‌న్యూస్:** యునైటెడ్ కాపు ఇంటర్నేషనల్ సర్వీస్ క్లబ్ పాలకొల్లు వారి ఆధ్వర్యలో ఎలమంచిలి మండలం దొడ్డిపట్ల గ్రామం జడ్పీ హైస్కూల్ నందు ఆదివారంమెగా మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఈ క్యాంపులో కిడ్నీ, మూత్ర సంబంధిత వ్యాధి నిపుణులు యాతం శ్రీరంగ, చర్మ వ్యాధి నిపుణులు జక్కంపూడి సుభాషిని, దంత వైద్య నిపుణులు కావలి మౌని, కిమ్స్ అమలాపురం ఆసుపత్రి నుంచి గుండె సంబంధిత వ్యాధి నిపుణులు కౌశికి, మరియు కంటి సంబంధిత వ్యాధి నిపుణులు వారి సేవలు అందించారు. సుమారు 300 మంది ప్రజలకు వైద్య సేవలు అందించి, ఉచితంగా బిపి షుగర్ పరీక్షల నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఇంటర్నేషనల్ డైరెక్టర్ ముచ్చర్ల సంజయ్, గవర్నర్ పెనుమాక రామ్మోహన్ , అధ్యక్షులు జక్కంపూడి మాధవ్, కార్యదర్శి వేరుకొండ దుర్గాప్రసాద్, కోశాధికారి సిరిగినీడి నాగార్జున, కానూరు ప్రభాకర రావు,బోనం నాని,చేగొండి రవిశంకర్,మద్దాల రాంప్రసాద్, గంధం ఏసుఫాధం, శిరిగినీటి రాంబాబు,గుండుమోగుల వీరాస్వామి, రావూరి అప్పారావు, కామిశెట్టి సాయిబాబు, కుంపట్ల రాజా, వీరాజీ, తదితరులు పాల్గొన్నారు.

# అమ్మవారికి వెండి కంచం బహుకరణ





**పెనుగొండ, మేజర్ న్యూస్:** పెనుగొండ మండలం వడలి గ్రామదేవత శ్రీ శ్రీ శ్రీ మందాలమ్మ అమ్మవారి ఆలయ అభివృద్ధిలో భాగంగా విశాఖపట్నం వాస్తవ్యులు వంకాయల విక్రమ్, శ్రీమతి రోజా దంపతుల కుమారుడు నివాస్ ,కుమార్తె సుప్రజ శ్రీ కుటుంబ సభ్యులు అమ్మవారికి ఆలయ కమిటీ సభ్యుల సమక్షంలో రూ. 38,000 విలువగల 500 గ్రాముల వెండి కంచం బహుకరించారు.ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ వీరిని స్ఫూర్తిగా తీసుకుని భక్తులు ఆలయ అభివృద్ధికి సహకరించాలని కోరారు .

## ఈ-పంట నమోదు త్వరితగతిన పూర్తి చేయాలి

జిల్లా కలెక్టర్ నాగరాణి



**కాళ్ళ,మేజర్‌న్యూస్:** ఖరీఫ్ ఈ -పంట నమోదును త్వరిత గతిన పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి సంబంధిత అధికారులు ఆదేశించారు.ఆదివారం జిల్లా కలెక్టర్ కాళ్ళ మండలం పెద్దఅమిరం పుంత రోడ్డులో ఇ-పంట నమోదు కార్యక్రమాన్ని స్వయంగా పరిశీలించి, సిబ్బందికి తగు సూచనలు చేశారు. ఖరీఫ్ సాగుకు సంబంధించి ఇ-పంట నమోదును రెవెన్యూ, వ్యవసాయ శాఖ అధికారులు సమన్వయంతో త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. రైతులు సాగు చేస్తున్న పంట వివరాల నమోదుతోనే పంటసాయం, పంటల భీమా, తదితర ప్రభుత్వ పథకాలు అందజేయడానికి వీలవుతుందని, ఇందుకు ఇ-పంట నమోదు తప్పనిసరి అన్నారు. దీనిని బాధ్యతగా తీసుకోవాలని సంబంధిత శాఖ అధికారులు ఆదేశించారు. పంట నమోదులో అలసత్వం వహించవద్దని హెచ్చరించారు. రైతులు ఏ పంటను సాగు చేస్తే అదే పంటను నమోదు చేయాలన్నారు. మరో పంట సాగు చేసినట్లు నమోదు చేస్తే వారిపై చర్యలు తప్పవన్నారు. కౌలుదారు అనే విషయాన్ని స్పష్టముగా ఈ పంటలో నమోదు చేయాలని తెలిపారు. రోజుకు వీలైనంత ఎక్కువ పరిధిలో ఈ పంట నమోదు చేయాలని అన్నారు. క్షేత్రస్థాయిలో ఫోటోలు తీసి అప్లోడ్ చేసే కార్యక్రమమును ఆమె పరిశీలించారు. ఇ-పంట డిజిటల్ యాప్‌లో వాస్తవ సాగుదారులు పేర్లనే నమోదు చేయాలని క్షేత్రస్థాయి సిబ్బందిని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆదేశించారు. ఇ-పంటను నమోదు చేస్తున్న సమయంలో ఆ భూమి సాగుదారుడు అయిన కౌలు రైతు కెల్లా సోమేశ్వరరావును జిల్లా కలెక్టర్ ప్రశ్నిస్తూ ఎంత పొలము కౌలుకు చేస్తున్నారు, ఎకరానికి ఎంత దిగుబడి వస్తుంది, వరి పంట కాకుండా వేరే విధమైన పంటను పండిస్తారా అని అడిగి తెలుసుకున్నారు. కౌలు రైతు సోమేశ్వరరావు సమాధానం ఇస్తూ నాలుగున్నర ఎకరాలు కౌలుకు తీసుకుని సాగు చేస్తున్నానని, వరి పంట తప్ప వేరే ఏ విధమైన పంటలు పండవని, అదికూడా పకృతి అన్ని విధాల సహకరిస్తే ఎకరాకు 40 బస్తాలు పంట దిగుబడి వస్తుందని తెలిపారు.ఈకార్యక్రమంలో వ్యవసాయ శాఖ ఏడి కె.ఏ.ఎస్.ఎస్ శ్రీనివాసరావు,ఇంచార్జి తహసిల్దార్ ఈ.నాగార్జున, ఆర్.ఐ లక్ష్మీ కిరణ్, విలేజి అగ్రికల్చర్ అసిస్టెంట్ దాసరి కనకదుర్గ, వీఆర్వో చిట్టిబాబు,కౌలు రైతులు కెల్లా సోమేశ్వరరావు, మద్య రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

## ప్రత్యేక హెూదా కోసం రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలి



**పాలకొల్లు,మేజర్‌న్యూస్:** రాష్ట్రానికి ప్రత్యేక హెూదా సాదించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు మంతెన సీతారాం కోరారు. ఆదివారం పాలకొల్లు మహిళ సంఘ భవనంలో కౌరు పెద్దిరాజు అధ్యక్షులుగా జిల్లా సిపిఎం కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో సీతారాం మాట్లా డుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వం మీద ఆధారపడి నడుస్తున్నదని ప్రత్యేక హెూదా సాధించు కోవడానికి ఇదే సరైన సమయం అన్నారు. విశాఖ ఉక్కు ప్రైవేట్ పరం కాకుండా కాపాడుకోవలసిన భాద్యత రాష్ట్రానిదని, అందుకే కేంద్రంతో పోరాడి ప్రయివేట్ పరం కాకుండా చూడాలని సీతారాం కోరారు. జిల్లా కార్యదర్శి బి.బలరాం మాట్లాడుతూ రాష్ట్రంలో ధాన్యం బకాయిలు పేరుకుపోయాయని వెంటనే రైతుల కు చెల్లింపు చేయాలని డిమాండ్ చేశారు. రైతులు ఖరీఫ్ పంటకు పెట్టుబడులు నిమిత్తం ఆదుకునేందుకు బకాయిలు చెల్లింపు చర్యలు చేపట్టాలని, జిల్లాలో రోడ్లు మరమ్మతులు చేపట్టాలని బలరాం కోరారు.దళితుల శ్మశాన వాటిక సమస్య పరిష్కరించాలని, వర్షాకాలంలో దళితులు చాలా ఇబ్బందులు పడుతున్నారని బలరాం అన్నారు. ఈ సమావేశంలో సిపిఎం నేతలు పివి ప్రతాప్, కర్రి నాగేశ్వరరావు, కేతా గోపాలన్, జె ఎన్ వి గోపాలన్, సిహెచ్. బాబురావు, జె, శ్రీనివాస్, జుత్తుగ నరసింహమూర్తి, పూర్ణ తదితరులు పాల్గొన్నారు.


## ఐఐటీలో సీటు సాధించిన మానస పూర్వ విద్యార్థికి అభినందనలు



భీమడోలు,మేజర్‌న్యూస్ : భీమడోలు మానస ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు దేశ స్థాయిలో నిర్వహించిన వివిధ పోటీ పరీక్షల్లో ర్యాంకులు సాధించడం అభినందనీయమని పాఠశాల కరస్పాండెంట్ యలమర్తి రవీంద్ర కుమార్ అన్నారు. ప్రస్తుత సంవత్సరం పాఠశాల పూర్వ విద్యార్థులైన గండి వినయ వర్మ ఐఐటిలో సీటును సాధించారు. ఇదేవిధంగా జాతీయస్థాయిలో ప్రతిష్టాకరంగా నిర్వహించిన నిట్ పరీక్షల్లో ఉన్నత స్థాయి ర్యాంకు సాధించిన కె.వంశీకృష్ణ ప్రతిష్ఠాకర విద్యాసంస్థ వరంగల్ నిట్‌లో సీటును సాధించారు. ఈ సందర్భంగా తనను కలిసిన వంశీకృష్ణను పాఠశాల కరస్పాండెంట్ అభినందించారు.వంశీకృష్ణ మరింత ఉన్నత స్థానానికి చేరుకోవాలని అభిలాషించారు.వంశీకృష్ణ ఉన్నత స్థానాలకు చేరటానికి సహకరించిన వారి తల్లిదండ్రులను, విద్యాబోధనలో సహకరించిన పాఠశాల ఉపాధ్యాయులను అభినందించారు.

## బిజెపి కార్యకర్తలకు అండగా ఉంటాను

కేంద్ర మంత్రి భూపతిరాజు వర్మ



**భీమడోలు,మేజర్‌న్యూస్:** బిజెపి కార్యకర్తలకు అండగా ఉంటానని కేంద్ర సహాయ మంత్రి భూపతి రాజు శ్రీనివాస వర్మ హామీ ఇచ్చారు. ఆయన బిజెపి జిల్లా స్థాయి నాయకులు తపన చౌదరితో కలిసి భీమడోలు మండలంలో ఆదివారం నిర్వహించిన వివిధ కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

వీరికి బిజెపి ఉంగుటూరు నియోజకవర్గ సహ సమన్వయకర్త వెజ్జు ధర్మారావు ఆధ్వర్యంలో బిజెపి నాయకులు,కార్యకర్తలు స్వాగతం పలికారు. అనంతరం వెజ్జు ధర్మారావు కార్యాలయం వద్ద పార్టీ కార్యకర్తలతో వారు సమావేశం అయ్యారు.వివిధ అంశాల గురించి చర్చించారు.పార్టీ స్థితిగతుల గురించి వారిని అడిగి తెలుసుకున్నారు. పార్టీబలో పేతానికి తగుసూచనలు చేశారు. కార్యక్రమంలో బిజెపి నాయకులు పి.వి.రాఘవులు,వి.కపిరాజు,జె సత్యనారాయణ, ఎస్ సుశీల రాణి పాల్గొన్నారు.

# 15 నుండి గ్రామ రెవిన్యూ సదస్సులు

**సెప్టెంబర్ 30 వరకు భూ వివాదాలపై సభల నిర్వహణ**
**మ్యుటేషన్, కౌలు రైతు కార్డులు,భూ వివాదాలు,**
**భూ ఆక్రమణ, నిషేధ జాబితా22(ఏ) సమస్యలపై అర్జీల స్వీకరణ**



**భీమవరం, మేజర్‌న్యూస్:** ఆగస్టు 16 నుండి సెప్టెంబర్ 30వ వరకు జిల్లా వ్యాప్తంగా గ్రామ రెవిన్యూ సదస్సులను నిర్వహించడం జరుగుతుందని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి కోరారు. జిల్లాలో ఆగస్టు 15న గ్రామ రెవెన్యూ సదస్సులు లాంచనంగా ప్రారంభించి, ఆగస్టు 16 నుంచి సెప్టెంబరు నెలాఖరు వరకు 45 రోజుల పాటు సదస్సులు నిర్వహించనున్నట్లు తెలిపారు.అక్టోబర్ 1 నుండి 45 రోజుల్లో పరిష్కారానికి ప్రభుత్వం కార్యాచరణ రూపొందించినట్లు తెలిపారు. ప్రజల నుంచి 5కేటగిరీల్లో పిటిషన్ల స్వీకరించి ఐదు రిజిస్టర్లలో నమోదు చేయాలన్నారు. మ్యుటేషన్, కౌలు రైతు కార్డులు(ఎల్ఈసీ), భూమి వివాదాలు, భూ ఆక్రమణ, నిషేధ జాబితా 22(ఏ) పిటిషన్లు స్వీకరించడం జరుగుతుందన్నారు. వీటిని ఆన్‌లైన్‌లో పొందుపరిచి, ఆర్‌టీజీఎస్ విభాగం పర్యవేక్షించినట్లు తెలిపారు. ఫిర్యాదు ఇచ్చిన ప్రజలకు వెంటనే ఓ రశీదు అందజేయనున్నట్లు తెలిపారు. వీటన్నింటికీ పరిష్కారం చూపేందుకు ప్రతి గ్రామంలోనూ రెవిన్యూ సదస్సులు ప్రభుత్వ ఆదేశాల మేరకు నిర్వహించడం జరుగుతుందన్నారు. రెవిన్యూ సదస్సులో తహసీల్దార్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, గ్రామ రెవెన్యూ అధికారి, మండల సర్వేయర్, దేవదాయ, వక్ఫ్ శాఖల ప్రతినిధులు, రిజిస్ట్రేషన్‌శాఖ అధికారి, అటవీ శాఖ అధికారి పాల్గొని ప్రజల నుండి అర్జీల స్వీకరిస్తారని తెలిపారు. ప్రతి అర్జీని ఆన్లైన్ చేసి అవసరమైతే క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రతి సమస్యపైన విచారణ జరిపి ఏం చర్యలు తీసుకున్నామో ఎ ి ర్యా ద ం దా ం ల క ం తెలియజేస్తామన్నారు. ప్రతి రోజు ఉదయం 9 గంటలకే రెవిన్యూ సదస్సులు ప్రారంభమవుతాయన్నారు సున్నితమైన భూసమస్యలపై సదస్సులు నిర్వహిస్తున్నందున కార్యక్రమం పూర్తయ్యేవరకు పోలీసులతో భద్రత ఏర్పాటు చేస్తామన్నారు. రెవిన్యూ సదస్సు లపై గ్రామ గ్రామాన స్థానిక మీడియా, కరపత్రాలు, పోస్టర్లు ద్వారా పెద్ద ఎత్తున ప్రచారం నిర్వహించాలని సంబంధిత అధికారులను ఆదేశించినట్లు కలెక్టర్ తెలిపారు. సదస్సుల నిర్వహణ, పర్యవేక్షణ కోసం ప్రతి జిల్లాకు సీనియర్ ఐఏఎస్ ప్రత్యేక అధికారిగా ప్రభుత్వం నియమించనున్నట్లు తెలిపారు. గ్రామ రెవెన్యూ సదస్సుల నిర్వహణకు జిల్లా జాయింట్ కలెక్టర్ నోడల్ అధికారిగా వ్యవహరిస్తారన్నారు. ఈ సదస్సుల్లో జిల్లా మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, జడ్పీ చైర్మన్, సభ్యులు, మండల, గ్రామ ప్రజాప్రతినిధులు పాల్గొనేలా సంబంధిత అధికారులు వాటికి ముందస్తుగా సమాచారం అందజేయాలనిజిల్లా కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలోని 20 మండలాల్లో 318 గ్రామాలు ఉన్నాయని, వాటిలో భీమవరం డివిజన్లో ఏడు మండలాల్లో 117 గ్రామాలు, నరసాపురం డివిజన్లో ఎనిమిది మండలాల్లో 111 గ్రామాలు, తాడేపల్లిగూడెం డివిజన్లో ఐదు మండలాల్లో 90 గ్రామాలు ఉన్నాయని కలెక్టర్ తెలిపారు.

# టిడ్కో గృహాల రుణాలు చెల్లించాలా? వద్దా?

**బ్యాంకులనుండి ఒత్తిడి..మౌనంగా కూటమి ప్రభుత్వం**
**ఆందోళనలో లబ్ధిదారులు**



**పాలకొల్లు,మేజర్ న్యూస్:** టిడ్కో గృహాలలో నివసిస్తున్న లబ్ధిదారులకు రుణాలు చెల్లించాలని బ్యాంకు నుండి ఒత్తిడిలు వస్తున్నాయని నివాసితులు వాపోతున్నారు, బ్యాంకు రుణాలను ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మాఫీ చేస్తామని ఎన్నికల ముందు హామీలు ఇవ్వడంతో ప్రజలు కూటమి ప్రభుత్వాన్ని గెలిపించారు.చాలా అపార్ట్మెంట్లో స్లాబులు లీకయ్యి వాటరుఇళ్లలోకివస్తుందని,ఆఫీసులో కంప్లైంట్ పెట్టినవారు పెడచెవిన పెడుతున్నారని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.మంచినీటి సదుపాయం లేక ఇప్పటివరకు వాటర్ ట్యాంకు నిర్మాణం పూర్తి కాకపోవడం గత వైసిపి ప్రభుత్వం అలసత్వం,ఎన్డీఏ కూటమి ప్రభుత్వం గెలుపొంది మూడు నెలలు కావస్తున్న వారు పట్టించుకోకపోవడం లబ్ధిదారులను అయోమయానికి గురిచేస్తుంది, జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ ఇకనుండి బ్యాంకు రుణాలు తీసుకోవద్దని లబ్ధిదారులకు విన్నవిస్తున్నారు. అయితే గతంలో మంజూరైన ఇళ్ల పరిస్థితి రుణాలు చెల్లించే విషయంలో ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు, 2014వ సంవత్సరంలో అప్పటి కూటమి ప్రభుత్వం బ్యాంకులలో అప్పు ప్రాతిపదికన రుణాలు ఇప్పించిన సంగతి విధితమే, కేంద్ర ప్రభుత్వం తన వాటాను పూర్తిగా అప్పట్లో మంజూరు చేసామని, ఇటీవల కేంద్ర మంత్రి దగ్గుపాటి పురందేశ్వరివెల్లడించారు,

వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల పరిపాలనలో బలవంతంగా బ్యాంకులకు లబ్ధిదారులను తాకట్టు పెట్టి ఆ సొమ్మును రాష్ట్ర ప్రభుత్వం వాడుకుందని, ఇప్పుడున్న నాయకులు చెబుతున్నారు, ఏది ఏమైనా పేద మధ్యతరగతి ప్రజలు ఈ విషయంలో నలిగిపోతున్నారు.

# పోలీస్ డ్రైవర్ అప్రమత్తత

## సామాన్యుడి ప్రాణాన్ని కాపాడిన హెూమ్ మంత్రి అనిత కాన్వాయ్




**ఏలూరు జిల్లా కైకరం ..జాతీయ రహదారిపై ఘటన**




**ఉంగుటూరు,మేజర్‌న్యూస్:** రాష్ట్ర హెూమ్ మంత్రి వంగలపూడి అనిత ప్రయాణిస్తున్న కాన్వాయ్ ఎస్కార్ట్ డ్రైవర్ అప్రమత్తతతో ఓ సామాన్యుడి నిండు ప్రాణానికి ప్రమాదం తప్పింది.ఏలూరు జిల్లా జాతీయ రహదారిపై ఆది వారం ఉదయం హెూమ్ మంత్రి అనిత ప్రయాణిస్తున్న కాన్వాయ్ కైకరం వద్దకు చేరే సరికి రోడ్డు పక్కన వెళ్తున్న ఓ ద్విచక్ర వాహన దారుడు అదుపుతప్పి ఒక్కసారిగా కుడి వైపు వెళ్తున్న కాన్వాయ్ వైపు ఒరిగి పడిపోయాడు. అయితే క్షణ కాలంలో జరిగిన ఘటనతో వెంటనే అప్రమత్తం ఆయిన హెూమ్ మంత్రి ఎస్కార్ట్ డ్రైవర్ ద్విచక్ర వాహన దారుడికి ఎలాంటి ప్రమాదం జరగకుండా ఉండాలని, తమ పోలీస్ వాహనాన్ని పక్కకు తప్పించి, సడెన్ బ్రేక్ వేశారు.. దీంతో కాన్వాయ్ మొత్తం ఒక్కసారిగా ఆగింది.ఆ ఘటనలో హెూమ్ మంత్రి అనిత ప్రయాణిస్తున్న కారునీ మరో కార్ స్వల్పంగా డీ కొట్టగా మంత్రి ప్రయాణిస్తున్న కార్ బంపర్ స్వల్పంగా డ్యామేజ్ అయింది. అకస్మాత్తుగా జరిగిన ఘటనతో ఏమి జరిగిందా అని అందరూ ఒకింత ఆందోళన చెందగా, అనంతరం విషయం తెలుసు కునీ, సామాన్యుడి ప్రాణానికి, కాన్వాయ్‌లోని హెూమ్ మంత్రి అనితకు ఎలాంటి ప్రమాదము జరగపోవటంతో పోలీస్‌భద్రతాసిబ్బంది అంతా ఊపిరి పీల్చుకున్నారు. అనంతరం పోలీస్ సిబ్బంది ద్విచక్ర వాహన దారుడీని క్షేమంగా పక్కకు తీసుకు వెళ్లారు.అనంతరం హెూమ్ మంత్రి అనిత వేరే కార్‌లో వెళ్లారు.

## అన్నదాన భవన నిర్మాణానికి రూ.లక్ష విరాళం



**ఆత్రేయపురం,మేజర్‌న్యూస్ :** కోనసీమ తిరుమల వాడపల్లి వెంకటేశ్వరస్వామివారి అన్నదాన భవన నిర్మాణానికి ఆదివారం యానంకు చెందిన గుబ్బల పరంజ్యోతి, హిమ పావని దంపతులు రూ.లక్ష విరాళాన్ని అందించారు. వీరికి ఆలయ అర్చక బృందం ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి స్వామి చరిత్ర గురించి వివరించారు. డిప్యూటీ కమిషనర్ భూపతిరాజు కిషోర్ కుమార్, సిబ్బంది స్వామివారి చిత్రపటం అందించారు.

## పర్యాటక కేంద్రంగా పిచ్చుక లంక అభివృద్ధి

– జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్



**ఆత్రేయపురం, మేజర్ న్యూస్ :** పర్యాటక కేంద్రంగా బొబ్బర్లంక శివారు పిచ్చుకలంక ప్రాంతం అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని బొబ్బర్లంక శివారు పిచుకు లంక ప్రాంతాన్ని కలెక్టర్ బృందం పరిశీలించింది. పీచుకులంక ను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు 2018లో ప్రభుత్వం సర్వేనెంబర్ 155లో 56 ఎకరాల భూమిని పర్యాటక శాఖకు అభివృద్ధి నిమిత్తం బదలాయించడం జరిగిందని అన్నారు. గతంలో ప్రభుత్వం బదాలయించిన భూమికి సంబంధించిన రికార్డులను క్షేత్రస్థాయిలో రెవెన్యూ సిబ్బందితో కలిసి పరిశీలించారు. కొత్తపేట ఆర్డిఓ జి.వి.వి. సత్యనారాయణ, తాసిల్దార్ టి.రాజరాజేశ్వరరావు, బొబ్బర్లంక గ్రామ సర్పంచ్ తదితరులతో కలిసి టూరిజ పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసే ప్రాంతాన్ని పరిశీలించారు. ఆర్ఐ భవాని గ్రామ విఆర్వోలు పాల్గొన్నారు.